

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6। కనిష్ఠం 19.5



జిల్లాలో నలుగురు సీఐల బదిలీ

కామారెడ్డి, జనవరి(ఆంధ్రజ్యోతి) 27: జిల్లాలోని నలుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీపీ డాక్టర్ తరుణ్‌జోషీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి ఎస్బీ-2 సీఐగా ఉన్న డి.సంతోష్ కుమార్‌ను సదాశివనగర్ సీఐగా బదిలీ చేశారు. సదాశివనగర్ సీఐగా పని చేస్తున్న ఎస్.రమణను ఐజీపీ, ఎల్లారెడ్డి సీఐగా పని చేస్తున్న ఎన్.శ్రీనివాస్, బిచ్కుంద సీఐగా ఉన్న ఆర్.కృష్ణాను ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మల్ ఎస్బీ సీఐగా ఉన్న బి. రవీందర్‌నాయక్‌ను ఎల్లారెడ్డి సీఐగా నియమించారు. సిద్దిపేట్‌లోని టాస్క్‌ఫోర్స్ సీఐగా ఉన్న జగడం నరేష్‌ను బిచ్కుంద సీఐగా నియమించారు.



అభ్యర్థుల వేట

- జహీరాబాద్ పార్లమెంట్‌పై ప్రధాన పార్టీల నజర్
- క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ
- గెలుపు గుర్రాలపై పార్టీల రహస్య సర్వేలు
- ఆశావహులు సైతం సొంతగా సర్వేలు చేయించుకుంటున్న వైనం
- ఫిబ్రవరి మొదటి వారంలో అభ్యర్థులను ప్రకటిస్తామన్న బీజేపీ
- టికెట్‌లపై ఆశావహుల ఆశలు

కామారెడ్డి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన మరో నెల రోజుల్లో షెడ్యూల్ రానుందని జోరుగా ప్రచారం సాగుతోంది. నెల ముందుగానే లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉండడంతో ప్రధాన పార్టీలు ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలపై ఆయా నియోజకవర్గాలకు ప్రధాన పార్టీలు ఇన్‌చార్జీలను సైతం నియమించి క్యాడర్‌ను సమాయత్తం చేసే పనిలో పడ్డాయి. జహీరాబాద్ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి ఆయా పార్టీలు హైదరాబాద్‌లో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు వ్యూహరచన చేస్తుండగా పలువురు నాయకులు తమకంటే తమకే టికెట్లు ఇవ్వాలంటూ పార్టీ నేతలను అభ్యర్థిస్తున్నారు. అయితే ప్రధాన మూడు పార్టీల్లో టికెట్ల కోసం ఆశావహుల నుంచి డిమాండ్ వస్తుండడంతో ఆయా పార్టీలు గెలుపు గుర్రాలపై రహస్య సర్వేలు చేయిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. మరోవైపు ఎంపీగా బరిలో ఉంటే గెలుస్తామా లేదా అనే దానిపై ఆశావహులు సైతం సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ టికెట్ ఎవరికో..

జహీరాబాద్ పార్లమెంట్ కంచుకోటగా ఉన్న కాంగ్రెస్ గత 10 సంవత్సరాలుగా పట్టు కోల్పోయింది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి పూర్వ వైభవాన్ని పొందేందుకు కసరత్తు చేస్తుంది. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లను సాధించి అధికారాన్ని చేజిక్కించుకుంది. అయితే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాలుగు సీట్లను దక్కించుకుని మెజార్టీలో ఉంది. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ఎంపీ టికెట్ ఎవరికి దక్కుతుందోనని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చసాగుతోంది. అయితే మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌తో పాటు మరో ముగ్గురు నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అయితే కాంగ్రెస్ సైతం గెలిచే అభ్యర్థులను బరిలో దింపేందుకు పార్టీ పరంగా రహస్య సర్వే చేయిస్తున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే ఈ లోక్‌సభ స్థానానికి ఇన్‌చార్జ్‌ను సైతం నియమించింది. బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి జహీరాబాద్‌కు ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ సీట్లను సాధించి అధికారంలోకి రావాలని ఆలోచనలో ఉంది. ఇటీవల హైదరాబాద్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీంలోనే రెండింటిని ఇప్పటికే అమలు చేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే సమయానికి మిగితా హామీలన్నీ నెరవేర్చి ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

బీజేపీలో పోటాపోటీ

జహీరాబాద్ ఎంపీ టికెట్‌కై బీజేపీలో ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం పది మంది ముఖ్యనేతలు జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇటీవల పోటీ చేసి ఓటమి పాలైన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి ఎంపీకై పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన బీజేపీలో చేరేటప్పుడు ఎల్లారెడ్డి అసెంబ్లీతో పాటు ఎంపీ టికెట్ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండలానికి చెందిన ప్రముఖ సైంటిస్ట్ సామాజిక సేవచేసే పైడి ఎల్లారెడ్డి సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన పార్లమెంట్ పరిధిలో బీజేపీ పార్టీ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఆర్ఎస్ఎస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండగా రాష్ట్ర జాతీయ స్థాయి నాయకులను కలుస్తూ వస్తున్నారు. మాజీ జిల్లా అధ్యక్షుడు గతంలో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన బాణాల లక్ష్మారెడ్డి సైతం టికెట్ ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. ఈసారి టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్ టికెట్ ఆశించి భంగపడ్డ మేడపాటి ప్రకాష్‌రెడ్డి సైతం టికెట్‌ను ఆశిస్తున్నాడు. టికెట్ కోసం ప్రకాష్‌రెడ్డి జాతీయ నేతలను కలుస్తూ వస్తున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆలె నరేందర్‌రెడ్డి తనయుడు భాస్కర్‌తో పాటు పైలా కృష్ణారెడ్డి, రచనారెడ్డి, రాంసింగ్, సోమయప్ప స్వామిజీలు సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం పోటీ పడుతూ ఎవరికివారే ప్రయత్నాలు చేస్తున్నారు. కామారెడ్డికి చెందిన చక్రవర్తిగౌడ్ తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈయన సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి పార్టీ పరంగా టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో అభ్యర్థిని ఎంపిక చేయడంలో ఆ పార్టీ నాయకత్వానికి సమస్యాత్మకంగా మారనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీఆర్ఎస్‌లోనూ పోటీ

జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన బీబీ పాటిల్ ప్రస్తుతం కొనసాగుతున్నాడు. మరో నెల రోజుల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ టికెట్ బీఆర్ఎస్ ఎవరికి ఇస్తాదనేది పార్టీ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బీబీ పాటిల్ ఎంపీగా గెలుపొందగా ఈసారి ఆయనకే టికెట్ ఇస్తారా మరెవరికైన టికెట్ ఇస్తారా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. 2014 ఇదే స్థానం నుంచి గెలుపొందిన పాటిల్ 2018 లోనూ స్వల్ప ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే నియోజకవర్గంలో ఎంపీపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంటుంది. ప్రజలకు పెద్దగా అందుబాటులో ఎంపీ ఉండరని ఆయనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పార్టీలు చేపట్టిన సర్వేల ద్వారా వెల్లడైనట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే బీఆర్ఎస్ జహీరాబాద్ నుంచి పాటిల్‌ను కాకుండా గెలిచే అభ్యర్థులను బరిలో దింపాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఉండగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఎంపీ టికెట్‌కై ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. ఇదే విషయమై ఇటీవల తెలంగాణ భవన్‌లో జరిగిన జహీరాబాద్ లోక్‌సభ కార్యకర్తల సమావేశంలోనూ భాస్కర్‌రెడ్డి పేరు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా కామారెడ్డి నియోజకవర్గంలోని బీబీపేటకు చెందిన సుభాష్‌రెడ్డి సైతం బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో చూడాలి.

ఎస్ఎంసీ రద్దుతో అయోమయం

- స్కూల్ గ్రాంట్స్ వినియోగానికి హెచ్‌ఎం, చైర్మన్ సంతకాలు తప్పనిసరి
- వచ్చే విద్యా సంవత్సరంలోనే నూతన కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

కామారెడ్డి టౌన్, జనవరి 27: రేపటితో ముగియనున్న ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)లను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన ఎన్నికలకు బ్రేక్ పడడంతో పాఠశాలల్లో గందరగోళం నెలకొంది. నూతన ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటు చేస్తుండడంతో ఇది వరకే పాత ఎస్ఎంసీ కమిటీలను రద్దు చేయడంతో స్కూల్ గ్రాంట్స్ వినియోగానికి హెచ్‌ఎం, చైర్మన్ సంతకాలు తప్పనిసరి కావడంతో ఏ విధంగా చేయాలనే దానిపై అయోమయం నెలకొంటుంది. ఎన్నికల రద్దుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ ఆగిపోవడంతో తలిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు సందిగ్ధంలో పడ్డారు. ఇప్పటికే జిల్లాలోని పాఠశాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై తల్లిదండ్రులకు ఆహ్వానపత్రాలు సైతం అందించారు.

ఈ సంవత్సరంలో లేనట్లే..

రాష్ట్రంలో చివరి సారి 2019లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వం రెండు సార్లు వాటి కాలపరిమితిని పొడిగించింది. పాత కమిటీల పదవికాలం డిసెంబరు 31తోనే ముగిసింది. నూతన కమిటీలను ఎన్నుకునేందుకు విద్యాశాఖ ఈనెల 20న నోటిఫికేషన్ జారీ చేయగా 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అంతలోనే ఎన్నికలు రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న విద్యా కమిటీలను రద్దు చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో మూడు నెలల్లో ఈ విద్యా సంవత్సరం ముగియనుంది. పదో తరగతి పరీక్షల కోసం ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో కొత్త కమిటీల ఏర్పాటు సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పాఠశాలల నిర్వహణ, అభివృద్ధిలో కమిటీ సభ్యుల పాత్ర కీలకం కావడంతో ప్రధానోపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. నూతన విద్యా సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్ రావడంతోనే ఎన్నికలు వాయిదా పడినట్లు సమాచారం.

నిధుల వినియోగం ఎలా..

పాఠశాలల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల విత్‌డ్రాకు సంబంధించి ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు జాయింట్ చెక్ పవర్ ఉంటుంది. ప్రస్తుతం పాత కమిటీలు రద్దు కావడంతో నిధుల విత్‌డ్రాపై స్పష్టత రాలేదు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు 50 శాతం నిధులు మాత్రమే ఎస్ఎంసీ ఖాతాల్లో ఇప్పటి వరకు జమయ్యాయి. ఈ నిధులు ఖర్చు చేస్తే మరో 50 శాతం నిధులు మంజూరు చేస్తామని విద్యాశాఖ మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. 2023-24 విద్యా సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలల గడువు మాత్రమే ఉండడంతో నిధుల వినియోగంపై ఎలా ముందుకెళ్తారనేది తెలియాల్సి ఉంది.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 27: డబుల్ బెడ్‌రూం ఇళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు తీసుకుని వాటికి సంబంధించిన పూర్తి వివరాలు ఈనెల 30లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్‌లు, వివిధ శాఖల ఇంజనీర్లతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మండలాల వారీగా మంజూరైన ఇళ్లు, పూర్తయిన, వివిధ దశలలో ఉన్న ఇళ్ల వివరాలను సేకరించి జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులకు పూర్తి సమాచారం అందించాలని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్‌లు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఐడీ నెంబర్ల వారీగా గృహాలు ఏ దశలో ఉన్నాయో వాస్తవ వివరాలను సేకరించి నివేదిక రూపంలో పంపాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో మెటీరియల్ కాంపోనెంట్ కింద ఒక్కొక్క నియోజకవర్గానికి నాలుగు కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలోని మూడు మండలాలకు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలోని మూడు మండలాలకు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. సిమెంట్ రోడ్లు నిర్మించడం కోసం ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. పనులు నాణ్యతగా చేపట్టి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, గృహనిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజనీర్‌ప్రసాద్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ మురళి, తహసీల్దార్, వి విధ శాఖల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాకు ఇబ్బందికరంగా ఉన్న కట్టడాలను తొలగిస్తాం

- ప్రజల కోసం స్థలంతో పాటు ఇంటినే కూల్చివేశాను
- ప్రజా రవాణాకు ఇబ్బందులు ఉన్న కట్టడాలను తొలగిస్తాం
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి
- దగ్గరుండి ఇంటిని కూల్చివేయించిన ఎమ్మెల్యే
- 900 గజాల స్థలంతో సుమారు రూ.4 కోట్ల వరకు నష్టం

కామారెడ్డి టౌన్, జనవరి 27: ప్రజా రవాణాకు ఇబ్బందికరంగా ఉన్న కట్టడాలను తొలగిస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వెళ్లే దారిలో ప్రజా రవాణా స్తంభిస్తుందని గ్రహించి రోడ్డు విస్తరణలో భాగంగా మొదట తన ఇంటినే కూల్చివేసి ఆదర్శంగా నిలిచారు. స్నేహపూరి కాలనీ రైల్వేగేట్ వద్ద 900 గజాలలో ఉన్న ఇంటిని దగ్గరుండి ఆయన కూల్చి వేయించారు. ఆ తర్వాత రోడ్డు విస్తరణకు చేపట్టాల్సిన పలు సూచనలను ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం స్థలంతో పాటు ఇంటినే కూల్చివేశానని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్ల రోడ్డు చేయాల్సి ఉందని కానీ ప్రస్తుతానికి 24 ఫీట్ల రోడ్డును వెడల్పు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎవరి ఇళ్లను, దుకాణాలను కూల్చివేయరని తెలిపారు. ఎవరికీ నష్టం జరగకుండా విడతలవారీగా రోడ్డు విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. రోడ్డుపై షెడ్లు వేసిన చోట, నల్లా కుళాయిల కోసం తవ్విన గుంతలను ఎక్కడికక్కడ కూల్చివేసి విస్తరణ పనులు ప్రస్తుతానికి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు రహదారుల వెంట ఆక్రమణలు ఉంటే వారంతట వారే తొలగించుకుని సహకరించాలని ప్రజా రవాణాకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ తన ఇంటిని సైతం మొదటగా కూల్చి వేశానని తెలిపారు. అయితే 900 గజాలలోని స్థలం సుమారు రూ.4 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా. గతంలో మున్సిపల్‌లో రోడ్డు విస్తరణకు సంబంధించి పలు సందర్భాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించి రగడ నడిచిన విషయం తెలిసిందే. ప్రజల సౌకర్యార్థం మొదట తన ఇంటినే కూల్చివేస్తానని అప్పట్లో మాట ఇచ్చిన ప్రకారమే ఎమ్మెల్యే కాగానే అభివృద్ధి పనులు చేపడుతూ ముందుగా తన ఇంటినే కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, టీపీవో గిరిధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



ఎమ్మెల్యే ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

పెద్దమల్లారెడ్డిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల గొడవ

- తామే లబ్ధిదారులమని ఇళ్లను శుభ్రం చేసుకుని ప్రవేశాలు

భిక్కనూరు, జనవరి 27: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు తమకు మంజూరయ్యాయని గ్రామానికి చెందిన పలువురు డబుల్‌బెడ్ రూం ఇళ్లను స్వాధీనం చేసుకుని శుభ్రం చేసుకుంటున్న సంఘటన భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. గ్రామంలోని పశువుల మార్కెట్ సమీపంలో గత ప్రభుత్వ హయాంలో 52 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి లబ్ధిదారుల ఎంపిక కోసం గతంలో గ్రామసభ నిర్వహించారు. కానీ లబ్ధిదారుల ఎంపిక అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పటి వరకు ఎలాంటి డ్రా తీయలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మీకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని పలువురికి చెప్పడంతో వారు శనివారం ఒక్కసారిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లి వాటిని శుభ్రం చేసుకుని ఇంటికి వారి పేర్లను రాసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మరికొంత మంది గ్రామ పంచాయతీ వద్దకు చేరుకుని తమకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది, పాలకవర్గం సభ్యులతో వాగ్వాదం చేశారు. తమకు ఎలాంటి సమాచారం లేదని ఇప్పటి వరకు లబ్ధిదారులకు సంబంధించి ఎలాంటి డ్రా తీయలేదని ఈవో లక్ష్మీ వారికి వివరించారు. కాగా ఈ విషయంపై భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌ను సంప్రదించగా ఇప్పటి వరకు డ్రా తీయలేదని అసత్యపు ప్రచారాలను నమ్మి ఎవరు ఇబ్బందులు పడొద్దని సూచించారు.



డబుల్ బెడ్ రూంల వద్ద మురికి కాలువలను శుభ్రం చేసుకుంటున్న దృశ్యం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్లు

'చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గింది'

పెర్కిట్, జనవరి 27: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టుగా ఆర్డీవో వినోద్‌కుమార్ ప్రకటించారని వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్‌లు తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనవరి 4న మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించగా.. 24మంది కౌన్సిలర్‌లు అవిశ్వాసం తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టుగా ఆర్డీవో ప్రకటించారని, అదేరోజు ప్రొసిడింగ్ కలెక్టర్‌కు పంపామని తెలిపారు. మాజీ చైర్‌పర్సన్ అనుచరుల అవినీతి అక్రమాలు బయటపడతాయని భయపడి అధికార పార్టీ మద్దతు తీసుకున్న విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రజలు, కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్, బీజేపీలు తిరస్కరించిన వారికి అధికార పార్టీ మద్దతు తెలపడం హాస్యాస్పదం అన్నారు. ఇందులో ఆకుల రాము, గంగామోహన్‌చక్రు, సుంకరి రంగన్న, అయ్యప్ప శ్రీనివాస్, రమేష్, లిక్కి శంకర్, ఇట్టెడి నర్సారెడ్డి, జహీర్‌అలీ, ఖాందేశ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పెద్దబజార్, జనవరి 27: గణతంత్ర దినోత్సవం రోజున కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అభ్యంతర కరమైన పదాలను సరి కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిందని ప్రజలు కూడా ఈ ఎన్నికల్లో మార్పు కోరుకొని నియంత పాలనను అంతమొందించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారం తెచ్చి సుమారు 50 రోజులే అవుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోటికచ్చినట్లు మాట్లాడటం సరికాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురాం, అంజల, రాధా, కుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్‌సీ నివేదిక ప్రకారం కార్మికులకు 30 శాతం సెటిల్‌మెంట్ ఇవ్వాలి'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ధర్పల్లి, జనవరి 27: జీవో నంబర్ 60 ప్రకారం 2021 పీఆర్‌సీ నివేదిక ప్రకారం అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 30శాతం సెటిల్‌మెంట్ ఇవ్వాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఈనెల 28న వనపర్తిలో జరిగే గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న నైపుణ్యం కలిగిన వారికి రూ.24500, పారిశుద్ధ్య కార్మికులకు రూ.20100, 18వేల వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలో జీవో 60 ప్రకారం రూ.9500 ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభలకు రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్, రంగారావు, సూర్యం, పద్మ హాజరవుతున్నారని జిల్లాలోని నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దామోదర్, సాయిరెడ్డి, రమేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

30న జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

జక్రాన్‌పల్లి, జనవరి27: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బ్రహ్మానందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న ఉదయం 1.30గంటలకు ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'పదో తరగతి పరీక్షలంటే భయపడొద్దు'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, జనవరి 27: పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులు భయపడవద్దని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తీర్ణత లభిస్తోందని లయోలా హైస్కూల్ కరస్పాండెంట్‌లు శ్యామ్‌సుందర్, ప్రధానోపాధ్యాయులు సురేష్‌లు అన్నారు.బోధన్ పట్టణంలోని లయోలా స్కూల్‌లో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందరంగా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పరీక్షలంటే భయపడొద్దని, ప్రణాళిక బద్ధంగా చదివితే అన్ని సబ్జెక్టులలో 10/10 మార్కులు సాధించవచ్చన్నారు. పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానం


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 27: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మాజీ ఎంపీ వి.హన్మంత్‌రావును సైతం జిల్లా బీసీసంఘాల నాయకులు సన్మానించారు.హైదరాబాద్‌లోని ఫతే మైదాన్ క్లబ్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలోమాజీఎమ్మెల్సీ ఆకుల లలిత, బీసీ సంఘ ఐక్యవేదిక నాయకుడు ఆకుల రాఘవేందర్, బొబ్బిలి నర్సయ్య, నాగరాజు, మురళి, రేవంత్, కరిపి గణేష్, శివకుమార్, రతన్, తదితరులు పాల్గొన్నారు. ఐక్యవేదిక కార్యక్రమంలో జిల్లాకు చెందిన బీసీ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వనందున మహేష్‌కుమార్‌గౌడ్‌కు మంత్రి పదవి ఇచ్చి బీసీలకు న్యాయం చేయాలన్నారు. త్వరలో జరుగనున్న బీసీ చైతన్య సదస్సుకు రావాలని వారిని ఆహ్వానించారు.

మందర్నలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

సాలూర, జనవరి 27: సాలూర మండలంలోని మందర్న గ్రామంలో శనివారం సీసీ డ్రైనేజీ పనులను సర్పంచ్ రావుబా గంగాధర్, ఎంపీటీసీ శివకుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల ద్వారా రెండు లక్షల రూపాయలతో మందర్న గ్రామంలో ఎస్సీ కాలనీల్లో సీసీ డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరు చేసిన నిధులతో హున్సా, మందర్న గ్రామాల్లో పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో సీసీ డ్రైనేజీ పనులకు మండల పరిషత్ ద్వారా నిధులు మంజూరు చేసిన ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.


సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీపీ ప్రతాప్ రెడ్డి

పెద్ద కొడప్‌గల్, జనవరి 27: మండలంలో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ పేర్కొన్నారు. శనివారం పెద్ద కొడప్‌గల్ మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మండలంలోని ఆయా శాఖలలో పనిచేసే ఉద్యోగుల పనితీరు సరిగ్గా లేదని అటువంటి వారందరూ తమ ప్రవర్తను మార్చుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఉద్యోగులు ఎలా ఉన్న తనకు అవసరం లేదని, ఇక నుంచి వారు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశానికి కొంత మంది అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన నివేదికలు లేకుండా వచ్చారని,మళ్లీఇలాంటి పునారవృత్తం కాకుండా సమావేశానికి అధికారులు నివేదికలతో రావాలని సూచించారు. అంతకు ముందు తొలిసారి మండలసర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యేతోట రాగా ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలికి సన్మానించారు.

● శాఖల పనితీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి

సమావేశం ప్రారంభం కాగానే ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ శాఖ నివేదికలు చదువుతుంటే వాటిని విన్న ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండలంలో విద్యాశాఖ పనితీరు బాగా లేదని ఇన్‌చార్జి ఎంఈవో దేవిసింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని మారుమూల గ్రామాలు, తండాలలో పనిచేసే ఉపాధ్యాయులు పనితీరు సరిగ్గా లేదని, ఆపాఠశాలలను ఎందుకు పర్యవేక్షించడం లేదని ప్రశ్నించారు. ఇంక ఉపాధ్యాయులు కొంత మంది మద్యం తాగి పాఠశాలలకు హాజరు అవుతున్నారని, అటువంటి వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రానున్న రోజులలో విద్యాశాఖ పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. దీంతో పాటుగానే మిషన్ భగీరథ నీరు గ్రామాలకు సక్రమంగా అందడం లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకరావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తవ పరిస్థితి మార్చుకోవాలని సూచించారు. పశుసంవర్థక శాఖ అధికారులు కూడ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. ఇక పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రం నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో ఈ విషయం కామారెడ్డి డీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొరత ఉండ టంతో పనులు సరిగ్గా జరగడం లేదని సభ్యులు తెలపడంతో సమస్య పరిష్కరించాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి,ఎంపీడీవోరాణి, తహసీల్దార్ దశరథం, ఎంపీవో సూర్యకాంత్, జడ్పీటీసీ చంద్రభాగ, సహకారసంఘం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జాఫర్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి


క్యాలండర్ ఆవిష్కరిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది, ఐఎఫ్‌టీయూ నాయకులు

డిచ్‌పల్లి, జనవరి 27: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ ను వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో కేజీబీవీ సిబ్బంది నిరసన ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీల్లో గత కొన్నేళ్లు గా పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదని ఆరోగ్య భద్రత కరువైందని వెంటనే వాటిని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లోపని చేస్తున్న సిబ్బందికి పనిభారం పెరిగిం దని నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కుక్, స్వీపర్, అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లును పరిష్కరించాలేని కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపామని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హామీలను అమలు చేయాలని లేనిచే డిమాండ్ల సాధనకు యూనియన్ నాయకత్వంలో పోరాడుతమన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది సుజాత, కరుణ శ్రీ, విజయ, పద్మ, మంజుల, పార్వతమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ప్రగతిశీల కేజీబీవి, నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో శనివారం ఆర్మూర్ కేజీబీవీలో క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్‌కు కనీస వేతనం అమలు కావడంలేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌లాంటి సౌకర్యాలు కల్పించి ఉద్యోగ భద్రతపై భరోసా ఇవ్వాలన్నారు. కనీస వేతనాలు అమలు కాకపోవడంతో సమగ్ర దోపిడికి గురవుతున్నారన్నారు. పనిభారం పెరిగిన ఖాళీలు భర్తీ చేయడంలేదని, పాఠశాలలను ఇంటర్ కాలేజీలుగా అప్‌గ్రేట్ అయిన కేజీబీవీలో పనిభారం మరింత పెరిగిందన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది సుమలత, రాధ, అనిత, శోభ, సునీత, రూప, విక్టోరియా, లక్ష్మీ, జయమ్మ, అనసూయ పాల్గొన్నారు.

మునిపల్లి పాఠశాలకు డెస్క్ బెంచీలు అందజేత


డెస్క్, బెంచీలను అందజేస్తున్న దాత ఎస్సై రావుట్ల ప్రేమ్‌సాగర్

జక్రాన్‌పల్లి, జనవరి27: మండలంలోని మునిపల్లి గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు చదువుకోవడానికి దాత ఎస్సై రావుట్ల ప్రేమ్‌సాగర్ డెస్క్ బెంచీలను అందజేశారు. శనివారం పాఠశాలకు ఏడు డెస్క్ బెంచీలను ఎస్సై ప్రేమ్‌సాగర్ పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.చిన్న సాయిరెడ్డి, ఉపసర్పంచ్ సాయన్న, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● తొర్లికొండలో విద్యార్థులకు ప్లేట్ల వితరణ

మండలంలోని తొర్లికొండ గ్రామంలో హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు అన్నం తినే ప్లేట్లు దాత చిట్యాల శేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఏర్పాటు

ధర్పల్లి, జనవరి 27: ధర్పల్లి, సీతాయిపేట్ పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాము నారాయణ, ప్రధానకార్యదర్శిగా క్యాదరి నారాయణ, కోశాధికారిగా అంకం ఆనంద్, ఉపాధ్యక్షుడిగా దువ్వ భూమేష్, కార్యదర్శిగా ఇంజపురం మహేందర్, సభ్యులను ఎన్నుకున్నారు. కాగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులకు ఓటింగ్ నిర్వహించారు. సంఘ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ విద్యార్థిని ఎంపిక

జక్రాన్‌పల్లి, జనవరి27: జాతీయస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలకు మండలం లోని కలిగోట్ గ్రామానికి చెందిన భవ్యశ్రీ ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని నెహ్రూ స్టేడియం శివమొగ్గ జిల్లాలో ఈనెల 29నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలి పారు. ఈ సందర్భంగా భవ్యశ్రీని సర్పంచ్ చేతనరెడ్డి, ఉపసర్పంచ్ రాజు, ఎంపీటీసీ జయ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ప్రారంభమైన అడ్మిషన్లు

పెర్కిట్, జనవరి27:ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల బాలికల పాఠ శాల, కళాశాలలో 2024-25 విద్యసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్‌లు పొదలయ్యాయని ప్రిన్సిపాల్ నహీదఫిర్దోస్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీలలో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా అడ్మిషన్‌ల అవగాహన కొరకు శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మోపాల్, జనవరి 27 :మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన వినోద్ (29) శనివారం ఇంట్లో ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాల వల్ల వినోద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కమ్మర్‌పల్లిలో వాల్వు గుంత పూడ్చివేత



వాల్వు గుంత (నిన్న) మొరంతో నింపిన వాల్వు గుంత (నేడు)

కమ్మర్‌పల్లి, జనవరి 27: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని జాతీయ రహదారిపక్కన ప్రమాదకరంగా మారిన మిషన్ భగీరథ, పిల్లర్ వాటర్ పైప్‌లైన్ వాల్వుగుంతలను సంబంధితశాఖ అధికారులు ఎట్టకేలకు పూడ్చివేశారు. జాతీయరహదారిపై ప్రమాద ఘంటికలు అన్నశీర్షికన ఈ నెల 8 న ఆంధ్రజ్యోతి లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారుల ఆమర్నాడే వాల్వు గుంతలను రేడియం స్టిక్కర్‌లు అతికించారు. గత రెండు రోజుల క్రితం వాల్వు గుంతలను వల్లిలతోట కప్పివేశారు. దీంతో ప్రయానికులు హర్ష వ్యక్తం చేస్తు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

యువతలో మార్పు రావాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి రవీందర్


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

మోపాల్, జనవరి 27: నేటి సమాజంలో యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని వారిలో మార్పు వచ్చే విధంగా పీవైఎల్ బాధ్యత తీసుకోవాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి వాల్గోట్ రవీందర్ సూచించారు. మోపాల్ మండల కేంద్రంలో ప్రగతిశీల యువజన సంఘం నిజామాబాద్ డివిజన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి వాల్గోట్ రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల, మత ఉన్మాదుల్లో యువత బలైపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెడదారి పడుతున్న యువతను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడి, పీడతనాలను ఎదిరింపజేసి సమసమాజంవైపు యువతను సమీకరించాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, వేములపల్లి కిరణ్‌కుమార్ ఆశయబాటలో యువత నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి నవీన్, డివిజన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను విజయవంతం చేయండి'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు

సిరికొండ జనవరి 27: వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ కార్మికులను కోరారు. మహాసభలకు సంబంధించిన గోడ ప్రతులను రావుట్ల గ్రామంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దామోదర్,సాయరెడ్డి,రమేష్,రవి,నర్సయ్య,లక్ష్మి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై ఇంటింటి సర్వే


కోటగిరిలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోటగిరి, జనవరి 27: కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం చిన్న చిన్న ఆరోగ్య సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. దగ్గు, జలుబు,జ్వరం ఉన్న వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకో వాలని సూచించారు. చిన్న పిల్లలు, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రభు త్వం ప్రత్యేక కృషి చేస్తుందని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ సర్వే నిర్వ హిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రోజా, మంజుల, ఆశాకార్యకర్తలు అనురాధ, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు


తొర్లికొండలో ఆలయ నిర్మాణానికి విరాళలు అందజేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, జనవరి27: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వెంకటేశ్వరస్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవీపేటలో బైక్ చోరీ



నవీపేటలో బైక్‌ను ఎత్తుకెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి

నవీపేట, జనవరి 27: నవీపేటలో శనివారం బైక్ చోరీకి గురైంది. బో ధన్‌లోని హనుమాన్ టెకిడికి చెందిన బి.రాజశేఖర్ శనివారం నవీపేటలో జరిగే మేకల సంతలో మేకలను కొనుగోలు చేయడానికి వచ్చాడు. నెహ్రూరోడ్డులోని ఒక బట్టల షాప్ ఎదురుగా తన ఫ్యాషన్ ప్రో బైక్‌ను నిలిపి ఉంచి సంతలోకి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. ఈ విషయంపై బాధితుడు నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని మాస్కు ధరించి వ్యక్తి బైక్‌ను ఎత్తుకెళుతున్నట్లు సీసీ కెమెరాలో నమోదైంది. పదిహేను రోజుల క్రితం జక్రాన్‌పల్లికి చెందిన వ్యక్తి బైక్ సైతం మేకల సంతకు వచ్చి తన బైక్‌ను పోగొట్టుకున్నాడు. నవీపేటలో జరిగే మేకల సంతలో తరచుగా బైక్‌లు చోరీకి గురవుతున్నాయని, వెంటనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముప్కాల్, జనవరి27: ఎస్సారెస్పీ వరదకాలువలో రెండు రోజుల క్రితం గల్లంతైన గడ్డం సాయన్న(58) మృతదేహం లభ్యమైనట్లు బాల్కొండ ఎస్సై గోపి తెలిపారు. ఈనెల 25 బోదేపల్లి శివారులో వరదకాలువలో కరెంటు మోటర్ బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటి విడుదల నిలిపివేశారు. శనివారం మోర్తాడ్ శివారు వరదకాలువలో గడ్డం సాయన్న మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, జనవరి27: పట్టణానికి చెందిన దన్‌పాల్ సంతోష్ కుమార్(45) వ్యాపారంలో నష్టపోయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 24న పనిమీద వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి రాకపోవడంతో శుక్రవారం భార్య శ్రీప్రియ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం పట్టణంలోని గూండ్ల చెరువులో సంతోష్ కుమార్ మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందిం చడంతో సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : మున్సిపల్ కమిషనర్

బోధన్ రూరల్, జనవరి 27: క్రీడలు మానసికంగా ఉల్లాసానికి దోహదం చేస్తాయని బోధన్ మున్సిపల్ కమి షనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రాకాసి పేట్‌లో క్రికెట్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా యువ కులతో కరచలనంతో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు నగదు బహు మతులు అందజేయబడుతా యన్నారు.సుమారు 40 మంది క్రికెట్ టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొం టున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రీమి యర్ లీగ్ నిర్వాహకులు సయ్యి ద్ మౌలానా, అబ్దుల్ జబ్బార్, చింటు, సూర్య, అమేర్, హాజర్, హర్షత్, పవన్, మెహరజ్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ

పెద్ద కొడప్‌గల్, జనవరి 27: మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు ఉన్న విద్యార్థులు శనివారం 30 మంది ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రతి నిత్యం ఉపాధ్యాయలు బోధించే పాఠాలను విన్న విద్యార్థులు శనివారం స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయలుగా మారిన విద్యార్థుల పాఠాలను విన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధ్యాయలుగా విధులు నిర్వహించారు.


బీర్కూర్‌లో డబుల్ ఇళ్లకు రంగులు వేయకుండా అడ్డుకుంటున్న దృశ్యం

డబుల్ బెడ్ ఇళ్లకు గులాబీ రంగులు

● అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

బీర్కూర్, జనవరి 27: మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా 36 డబుల్ బెడ్ ఇళ్లను నిర్మించారు. పనులు పూర్తి కావడంతో సదరు కాంట్రాక్టర్ ఇళ్లకు రంగులు వేయిస్తున్నాడు. ఇదిలా ఉండగా శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డబుల్ బెడ్ రూమ్‌ల వద్దకు చేరుకుని ఇళ్లను పరిశీలించారు. ఇళ్లకు గులాబీ రంగులు వేస్తుండటంతో కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇళ్లకు బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన గులాబీ రంగులు ఎలా వేస్తారని అక్కడ ఉన్న సూపర్‌వైజర్ రమేష్‌ను కాంగ్రెస్ నాయకులు నిలదీశారు. రంగులు వేయడం నిలిపివేయాలని హెచ్చరించారు. దీంతో కాంగ్రెస్ నాయకులకు సూపర్ వైజర్ రమేష్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మీరు చెబితే వినని సూపర్ వైజర్ కాంగ్రెస్ నాయకులకు తేల్చి చెప్పారు. దీంతో కాంగ్రెస్ నాయకులు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్ డిప్యూటీ ప్రభాకర్‌కు ఫోన్ చేసి జరిగింది చెప్పారు. డిప్యూటీ సదరు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి గులాబీ రంగు వేయవద్దని ఆదేశించాడు. దీంతో సూపర్‌వైజర్ రంగులు వేయడం నిలిపివేశాడు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలకు గులాబీ రంగులు వేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వారాజు, రాములు, ఇక్బాల్, కిరణ్ పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువెళ్తాం

● కాంగ్రెస్ నాయకులు

బీర్కూర్, జనవరి 27: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జీల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో భానుప్రకాష్‌తో కలిసి బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఇటీవల గురుకుల పాఠశాలను నూతనంగా నిర్మించారు. అయితే సదరు కాంట్రాక్టర్ పనులను సరిగ్గా చేపట్టలేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. వందలాది మంది విద్యార్థులు ఉండే గురుకులంలో వంటశాల నిర్మించలేదన్నారు. పాఠశాలలో మురుగు నీరంతా రోడ్డుపై వదిలేశారని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గురుకుల పాఠశాలలో వాష్ రూమ్‌లలో, స్నానాల గదుల్లో నీళ్ల రావడం లేదని విద్యార్థులు కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. గురుకుల పాఠశాల పనులను సదరు కాంట్రాక్టర్ పై అడ్డదిడ్డంగా నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజ్, రాములు, ఇక్బాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ

బాన్సువాడ టౌన్, జనవరి27: ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేయాలని, విద్యార్థులు దేశ సేవ చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, మయూరి, నీరడి ఆనంద్, గౌని శంకర్, రాజు, మనెమ్మ తదితరులున్నారు.

యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

● ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేష్

కామారెడ్డి టౌన్, జనవరి 27: నేటి యువత స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేష్ పిలుపునిచ్చారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన వారోత్సవాల ముగింపు సభను శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళా భారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వ అధ్యక్షుడు నరేష్ మాట్లా డుతూ స్వామి వివేకానంద భారతదేశ సంస్కృతిని చరిత్రను ప్రపంచ దేశాలకు విస్తరించారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమతో ఇంగ్లిష్ దొరలను దేశం నుంచి తరిమికొట్టి స్వాతంత్రం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారన్నారు. అలాంటి గొప్ప మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతీఒక్క పౌరుడు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే గెలుపోటములను అలవాటు చేస్తూ గెలిచిన వారు తమ బాధ్యతగా మరింత ముందుకు వెళ్లాలని సూచించారు. ఓడిన వారు గెలుపు కోసం ప్రయత్నాలు చేయాలన్నారు. యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ఏబీవీపీ ప్రతీ సంవత్సరం స్వామి వివేకానంద, నేతాజీ జయంతిలను పురస్కరించుకుని యువజన ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే కామారెడ్డిలో మూడు రోజుల పాటు విద్యార్థులకు, యువతకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ సంఘటన మంత్రి రాజుసాగర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, జిల్లా కన్వీనర్ కృష్ణ, నగర అధ్యక్షుడు అనిల్, జిల్లా ప్రముఖ్ గిరి, రోహిత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతిని అందిస్తున్న ఏబీవీపీ నాయకులు


హాజీపూర్‌లో పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

నసురుల్లాబాద్, జనవరి 27: నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ చంటి నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణానికి, అదేవిధంగా రాజేశ్వర్ తండాలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షలతో స్కూల్ బిల్డింగ్ నిర్మాణం, రూ.10లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంజూరు కావడం జరిగిందన్నారు. త్వరలో ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ విఠల్, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామారెడ్డిరూరల్, జనవరి27: సీఎంఆర్ లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి జిల్లా కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కామారెడ్డి డివిజన్ రైస్ మిల్ యాజమానులతో సీఎంఆర్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు జిల్లా కలెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ లక్ష్యాలు పూర్తిచేయని మిల్లుల యజమానులకు జరిమానాలు విధిస్తామని తెలిపారు. లక్ష్యం పూర్తిచేయని మిల్లులను సీజ్‌చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదుచేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లిఖార్జున్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ అభిషేక్‌సింగ్, రైస్‌మిల్లుల యజమానులు, రైస్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులున్నారు.


నసురుల్లాబాద్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

నసురుల్లాబాద్, జనవరి27: మండల కేంద్ర పరిధిలోని గండి ప్రాంతంలో శనివారం నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎస్సై లావణ్య మాట్లాడుతూ ధ్రువపత్రాలు లేని వాహనాల యజమానులకు ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు వేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు రహదారిపై వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, లైసెన్స్ వెహికల్ ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే కార్ డ్రైవింగ్ చేసేవారు సీట్ బెల్ట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ అబిబ్‌బెగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పోడురైతులకు హక్కు పత్రాలు అందించాలి'

మాచారెడ్డి, జనవరి27: ఏళ్లతరబడి కబ్జాలో ఉన్న పోడు రైతులకు హక్కుపత్రాలు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట, బంజపల్లితండా, అంకిరెడ్డిపల్లితండా, గుడితండా, మంగళగిరితం డాలో రోసా కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోడురైతుల సమావేశాల్లో జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు పాల్గొని మాట్లాడారు. తాతల కాలం నుంచి కబ్జాలో ఉన్న పోడు సాగుదారులకు గత ప్రభుత్వం హక్కుపత్రాలు పట్టాలు ఇవ్వకుండా పోడుభూములకు పట్టాలు ఇచ్చామని చెప్పుకున్నారని తెలిపారు. మండలంలోని గుంటితండాకు సంబంధించి ఇక్కడ ఫారెస్ట్ అధికారులు బీట్ ఆఫీసర్‌లు ఎవరైతే డబ్బులు ఇయ్యలేదో వారి భూములను నాన్ ఇన్ పోజిషన్ వీళ్ల కబ్జాలో లేరని తప్పుడు నివేదికను అందించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన వీరికి న్యాయం చేయాలని అందుకోసం ఈనెల 29న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్, జిల్లా కమిటి నాయకులు మధురం దర్శి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాధన సూరుల విన్యాసాలు

మద్నూర్, జనవరి27: మండలకేంద్రంలోని గాంధీచౌక్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సాధన సూరుల విన్యాసాలను ఏర్పాటు చేశారు. సాధన సూరులు తమశక్తితో విన్యాసాలు చేయగా, ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. తలపై వంట చేయడం అందరిని ఆకర్షించింది. అనంతరం మండల కేంద్రంలో పద్మశాలి సంఘ భవనంలో పద్మశాలిసంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ, శ్రీనివాస్, కుశాల్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మేనూర్‌లో మెగా ఆరోగ్య వైద్య శిబిరం

మద్నూర్, జనవరి27: మండలంలోనిమేనూర్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనూర్‌లో ఉచితమెగా ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ రాజన్న శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు, దంత పరీక్షలు, గుండెకు సంబంధించి ఈసీజీ, టూడీ, ఈవో వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దస్తీరాం, విజయ్ బండివార్, రాజా ప్రసాద్, ఉమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ప్రతీ సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి

సదాశివనగర్, జనవరి 27: నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతీ బాలిక ధైర్యంగా ఎదుర్కోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జిల్లాన్యాయవాది రమేష్‌చంద్ అన్నారు. సదాశివనగర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బాలలహక్కులు, బాల్య వివాహాలు, మానవ అక్రమరవాణా, సామాజిక మాధ్యమల వల్ల ఎదురువుతున్న సమస్యలు, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలు, బాలలహక్కులు, విద్యహక్కు చట్టాలు, గృహహింస నిరోధక చట్టాలను పోక్సోచట్టంల గురించి అవకాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఏఎస్ఐ గంగాసాగర్ సైబర్ నేరాల గురించి బాలికలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, టోల్‌ఫ్రీ నంబర్‌లు సైబర్ క్రైమ్ 1930, చైల్డ్‌లైన్ 1098, మహిళ హెల్ప్‌లైన్ 181 సమస్యలో ఉన్నప్పుడు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో యూసెఫ్, ప్రిన్సిపల్ భానుమతి, డీపీఎం రమేష్‌బాబు, ఐయస్ఆర్‌డీ స్వచ్ఛంద నిర్వహకులు అమృత రాజేందర్,సాయికృష్ణ, సాయిప్రణీత్, మానవ అక్రమరవాణా, సిబ్బంది రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవారంగంలో పరస్పర సహకారం ఉండాలి

కామారెడ్డిటౌన్, జనవరి 27:వ్యాపారపరిచయాలు, సేవారంగంలో పరస్పర సహకారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని పటేల్ ఎంట్రిప్రినియర్స్‌నెట్వర్క్(పెన్) రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ పి. లక్ష్మీనారాయణ పటేల్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని హోటల్ పరిణిక ప్యాలెస్ 24వ పెన్ సదస్సును నిర్వహించారు. దేశంలో, రాష్ట్రంలో కాని ఎక్కడ సమస్య ఎదురైన పరస్పర సహకారంతో క్షణాల్లో పరిష్కారం చేసుకునేందుకు పెన్ వేదికగా నిలుస్తుందన్నారు. ఇందుకోసం అన్ని వర్గాల వారు భాగస్వామ్యం అవసరం ఉందన్నారు. ఈతరం,భావితరాల భవిష్యత్తుకోసం ఎంతగానోదోహద పడుతాయన్నారు. ప్రముఖకవి, మోటివేషన్ స్పీకర్‌మున్నూరుకాపు సంఘం సౌత్‌ముంబై ప్రధానకార్యదర్శిసంఘవేణి రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కనెక్టివిటితో ముందుకు వెళ్లవచ్చని వివరించారు. పెన్‌లో ఆ కనెక్టివిటి,యూనిటి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్ జాతీయ,రాష్ట్ర ప్రతినిధులు తోటదేవేందర్, నీలంలింగం, సదానందం,భాస్కర్, రమేష్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వ నమోదు

నిజాంసాగర్, జనవరి27: నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో పనిచేస్తున్న ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వ నమోదును ఆదివారం తెలంగాణ పంచాయతీ రాజ్ సెక్రటరీ ఫెడరేషన్ (టీపీ ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తీర్చడంలో ముందుంటామన్నారు. ఓపీఎస్‌ల సమస్యలు త్వరగా పరిష్కరించాలని, 4 సంవత్సరాల సర్వీస్ గురించి రాష్ట్ర ప్రభుత్వంతో త్వరిత గతిన చర్చలు జరిపి సఫలీకృతం చేయాలని జిల్లా, రాష్ట్ర నాయకులుచొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల (పీఎస్, జెపీఎస్, ఓజెపీఎస్) సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శుల అధ్యక్షుడు డి.రాజు, జిల్లా ఈసీ మెంబర్ రవి రాథోడ్, పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, శిరీష, సుధారాణి, సునీత, ఫరీదా, సంతోష్, అంబయ్య, శేఖర్, అంజయ్య, పండరి, గంగారాం, తదితరులున్నారు.

భిక్కనూరులో ప్రారంభమైన శివదీక్షలు

భిక్కనూరు, జనవరి27: భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివదీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలకేంద్రానికి చెందిన అందె దయాకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన 13మంది శివమాలను స్వీకరించారు. ఈ మేరకు ఆలయంలో స్వామివారికి మాలాధారణ స్వాములు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గురుస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన భక్తులు జనవరిలో శివమాల ధరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి సదాశివమహంత్, అర్చకుడు రాజేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: మహా శివరాత్రి సందర్భంగా 41 రోజుల శివ మాల దీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని ఖత్‌గావ్ బస్వేశ్వర మఠంలో మఠాధిపతి మల్లిఖార్జున్ అప్ప స్వామిజీ దీక్షదారులకు మాల ధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్ష కాలంలో శివనామస్మరణ చేస్తూ దీక్ష కొనసాగిస్తారని మార్చి 8 మహా శివరాత్రిన దీక్ష విరమణ ఉంటుందని తెలిపారు.

యాసంగి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మద్నూర్, జనవరి27: మండలంలోని ఆయా గ్రామాలలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్ రెడ్డి, రేవంత్‌లు మండలంలోని చిన్న ఎక్లారాలో సాగుచేస్తున్న మినుము, పొద్దు తిరుగుడు, వేరు శనగ తదితర పంటలను పరిశీలించారు. మినుము పంటలో ప్రధానంగా మారుక మచ్చల పురుగు అధిక ఉధృతి ఉందని గమనించి, దాని నివారణకు రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అదేవిధంగా బూడిద తెగుళ్ల నివారణలు సలహాలు, సూచనలు అందజేశారు. వేరు శనగ పంటలో ఆకు ముడత తెగుళ్ల గమనించి, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కుసుమ పంటలో పెను బంక నివారణకు చర్యలు తీసుకోవాలని సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఎఈవోల దృష్టికి పంటలకు సోకుతున్న తెగుళ్లపై సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎకిషన్, ఎవో రాజు, ఎఈవో సతీష్, తదితరులు పాల్గొన్నారు.


చిన్న ఎక్లారాలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి


పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట

పెద్దకొడప్‌గల్, జనవరి 27: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ అన్నారు. శనివారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమ శిక్షణ నేర్పాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి ఏది అవసరమైనా తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయురాలు కమల, పాఠశాల సిబ్బంది, నాయకులు మహేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, మోహన్, సంజీవ్, పండరి, స్థానియ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మండలంలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలు పరిష్కరించాలని శనివారం జుక్కల్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించి తమ సమస్యలకు పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఓపీఎస్‌తో నాలుగేళ్ల పూర్తిచేసుకున్న వారిని క్రమబద్ధీకరించాలని, క్రమబద్దీకరించిన పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల సర్వీసు యాడ్‌చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు రాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. అలాగే పెద్దకొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ మొక్కను నాటారు. మొక్కలను సంరక్షించాలని సూచించారు.

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

మద్నూర్: మండలంలోని మేనూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను శనివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్లకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తుందని, ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు వేయడానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విఠల్ గురూజీ, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలని నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

కామారెడ్డి టౌన్, జనవరి 27: దళితబంధు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దళితులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్డులో శనివారం మానవహారం నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గానికి 1100 దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయని ఈ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయడం లేదని అన్నారు. కొందరికి బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు జమ అయినా బ్యాంక్‌ల ద్వారా అందకుండా చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం దళితులకు రూ.10లక్షల దళితబంధు ఇస్తామంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.12లక్షలు ఇస్తామని చెప్పిందని వారు గుర్తు చేశారు. కాగా ప్రస్తుతం ఉన్న దళితబంధు నిధులను కూడా విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వెంటనే దళిత బంధు నిధులను విడుదల చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగి మోహన్, ఆయా మండలాల నాయకులు, దళితులు తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	హనుమాన్
శాంతి	గుంటూరు కారం
ప్రియా 70	క్యాప్టెన్ మిల్లర్
ప్రియా 35	అయాలన్

బాన్సువాడ

మహేశ్వరి	గుంటూరు కారం
వెంకటేశ్వర	హనుమాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

